క్లుప్తంగా

ఉల్లి రైతుకు నష్టపరిహారం అందించాలి



వీపనగండ్ల: వర్షాలతో నష్టపోయిన ఉల్లిరైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని జిల్లా వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఆంజనేయులు, ఎండీ మహబూబ్‌పాషా అన్నారు. మండలంలోని ఆదివారం గోవర్ధనగిరి గ్రామంలో ఎండీ ఖాజ ఉల్లిని సాగుచేసి గిట్టుబాటు ధర రాక ఆర్థికంగా ఇబ్బందులకు గురైన రైతు కుటుంబాన్ని సంఘం నాయకులు పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. 10ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని దాదాపు రూ.8లక్షలు ఖర్చు చేశారన్నారు. కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన ఉల్లిపంటను హైదరాబాద్‌లోని గుడిమల్కాపురం మార్కెట్‌లోకి తీసుకువెళ్లగా క్వింటా రూ.200 ధర రావడంతో అక్కడే వదిలేసి గ్రామానికి వచ్చారన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారాన్ని అందివ్వాలని విజ్ఞప్తి చేశారు.

పేదల పెన్నిధి లక్ష్మీదేవమ్మ



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో పేదప్రజల బాగుకోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన లక్ష్మీదేవమ్మ ప్రథమ వర్ధంతి సభను వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. లక్ష్మీదేవమ్మ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి కష్టజీవుల సమస్యల కోసం అహర్నిశలు పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాలపీర్, అన్‌స్కిల్డ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దిలేటి, సురేష్, పడిగన్న, ఎండీ షాజహాన్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, ఎండీ మహబూబ్‌పాషా పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వీపనగండ్ల: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ కే.రాణి అన్నారు. ఆదివారం గోపల్‌దిన్నె సైబర్‌నేరాలపై యువకులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వడం ద్వారా విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే అధికారులకు సమాచారాన్ని తెలపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పలువురు కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఆత్మకూర్: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో మస్జీదే సయ్యదీయ నుంచి ముస్లింలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతికోసం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మజీద్‌లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గయాజుద్దీన్, ఖలీల్, గణి, జాఫర్, అఫ్రోజ్, మస్తాన్, ఉమర్, ముబీన్, సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ ఉన్నారు.

గ్రహీతకు సన్మానం



కొత్తకోట రూరల్ : పట్టణ కేంద్రానికి చెందిన జనంపల్లి రవికుమార్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విజయవాడలో ఫార్మాకాలజీ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి చేతులమీదుగా డాక్టరేట్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం జిల్లా మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జే.భక్తరాజు, అమృతరాజు, మహిమరాజు, శ్యామ్‌కుమార్, సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు.. కంపు కంపు

- కోళ్లవ్యర్థాలు, పందుల విహారంతో తీవ్ర దుర్వాసన
- అనారోగ్యం పాలవుతున్న కస్తూర్బా విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఖిల్లాఘనపురం నుంచి వెంకటాంపల్లి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు

ఖిల్లాఘనపురం: పేదరికంతో చదువుకు దూరమవుతున్న బాలికలకు నాణ్యమైన విద్యఅందించేందుకు ఖిల్లాఘనపురం లో ఏర్పాటు చేసిన కస్తూర్బా బాలికల విద్యాలయాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచి ఎంతోమంది బాలికలు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. ప్రశాంతంగా చదువుకుంటున్న విద్యార్థులకు పాఠశాలల సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు శాపంగా మారింది. ప్రతిరోజూ డంపింగ్‌యార్డు నుంచి పెద్ద ఎత్తున దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేస్థలంలో రైతువేదిక, కల్యాణ మండపాలు ఉన్నాయి.

కుంటను తలపిస్తోంది..

మండలకేంద్రం నుంచి వెంకటాంపల్లి, ఆగారం, గట్టుకాడిపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డుకు పక్కనే ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు కుంటను తలపిస్తుంది. గుట్టపక్కనే గ్రామస్తులు అవసరాల కోసం మొర్రం తరలించుక పోవడంతో పెద్దగుంత ఏర్పడింది. అదే గుంతను డంపింగ్‌యార్డుకు ఉపయోగిస్తున్నారు. వర్షాకాలం కావడంతో నీళ్ళు నిండి నేడు కుంటను తలపిస్తుంది. గ్రామంలో సేకరిస్తున్న చెత్తను నేరుగా ఈ డంపింగ్‌యార్డులో వేస్తుండటంతో నీటిలో మురిగి దుర్వాసన వస్తుంది.



డంపింగ్‌యార్డులో పందులు, కుక్కలు

కస్తూర్బా వెనకాలే డంపింగ్‌యార్డు ..

మండల కేంద్రం నుంచి వెంకటాంపల్లికి వెళ్లే రోడ్డుకు సొడమ్మ గుట్టదగ్గర ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు కస్తూర్బా పాఠశాలల వెనకవైపు ఉండటంతో విద్యార్థులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా మండల కేంద్రంలో తెలుగు మీడియంతో పాటు మైనారిటీ కస్తూర్బా ఇదే ప్రాంతంలో ఉన్నాయి. మొత్తం 449 మంది విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు.

పందులు, కుక్కల స్వైరవిహారంతో ప్రమాదాలు..

డంపింగ్‌యార్డు దగ్గర నిత్యం కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన పదార్థాలు వేస్తుండటంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆగారం, గట్టుకాడిపల్లి తదితర గ్రామాలకు రాత్రివేళలో మోటర్‌సైకిళ్లపై వెళ్తుంటే వారికి పందులు, కుక్కలు తగిలి పలువురికి గాయాలైన ఘటనలు ఉన్నాయి.

పాఠశాలలో ఉండలేక పోతున్నాం



కళాశాల వెనకాల ఉన్న డంపింగ్‌యార్డు నుంచి నిత్యం దుర్వాసన వస్తుంది. ఆ సమయంలో మా మేడం వాళ్లందరిని వరండాలోకి తీసుకవస్తుంటారు.

– శివాణి, ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఇంగ్లిష్ మీడియం కేజీబీవీ

పందులు, వ్యర్థాలతో దుర్వాసన



పాఠశాల వెనకవైపు ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో నిత్యం చెత్త, వ్యర్థాలు వేస్తుంటారు. ఒక్కోరోజు పందులు మొత్తం చెత్తను తవ్వడంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. అందరం ముక్కులు మూసుకుని కూర్చుంటాం.

– అపూర్వ, 7వ తరగతి కేజీబీవీ ఇంగ్లిష్ మీడియం,

మండల నాయకుల దృష్టికి తీసుకెళ్లాం



మా పాఠశాలతో పాటుగా పక్కన్నే తెలుగుమీడియం కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 449మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. యార్డులో ప్రస్తుతం నిండుగా నీళ్ళు ఉన్నాయి. అదే నీటిలో వ్యర్థాలు, చెత్త అన్ని వేస్తున్నారు. విషయాన్ని పాలకులకు, హెల్త్ డిపార్టుమెంట్లకు చెప్పాం.

– లలిత, కేజీబీవీ ఇంగ్లిష్ మీడియం, ప్రిన్సిపల్

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



ఖిల్లాఘనపురంలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బా పాఠశాలలు, రైతువేదిక, సర్వవర్గ కల్యాణ మండపం దగ్గర ఉన్న డంపింగ్‌యార్డు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఆందోళన చెందొద్దు.

– అంజయ్య, మండల ప్రత్యేకా అధికారి

అ‘పూర్వ’ సమ్మేళనం



ఆత్మకూర్‌లో సమావేశమైన 1995-96 పూర్వవిద్యార్థులు

ఆత్మకూర్: వారంతా పదికాదు, ఇరవైకాదు 30 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్నారు. ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1995–96 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో చదివిన తరగతి గదుల్లో జరిగిన చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు బాబుదేవిదాస్‌రావ్, మహేశ్వర్, కురుమూర్తి, రఫియోద్దీన్, బషీర్‌అహ్మద్, రాంరెడ్డి, రమణయ్యలను పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. చనిపోయిన తోటి విద్యార్థుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, పూర్వ విద్యార్థులు శివశంకర్, తమ్మలివిజయ్, గురుప్రసాద్, శ్రీరామ్, శ్రీను, కవిరాజు, రఫీ, సురేష్, హిమాకర్, క్రాంతి, లక్ష్మన్న, సుధాకర్, రఘు, రాకేష్, అచ్యుత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బేడ బుడగజంగం యువజన కమిటీ ఎన్నిక

గోపాల్‌పేట: ఆదివారం హైదరాబాద్‌లో బేడ బుడగజంగం వ్యవస్థాపక అధ్యక్షుడు గగనం వెంకటస్వామి ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ యూత్ కమిటీని ఎన్నుకున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాయింట్ యాక్షన్ యూత్‌కమిటీ అధ్యక్షుడిగా వానరాశి శివవర్మ, ఉపాధ్యక్షుడిగా సిరివాటి సురేష్, గగనం గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడమంచి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా బాణాల రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గగనం శివుడు, గగనం ఓంకార్, సెక్రెటరీగా బుద్దిఎల్లయ్య, సహాయ కార్యదర్శులుగా గడ్డం తనీష్, కొల్లెం నరేష్, అష్యజమ్మన్న, కడమంచి ఆనంద్, కోశాధికారిగా రానూరి శ్రీనివాస్‌ల తదితరులను ఎన్నుకున్నారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి గ్రామంలో ఎమ్మెల్యే మేనమామ వెంకట్రాంరెడ్డి అల్లుడు నాగేశ్వర్‌రెడ్డి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం తాడిపర్తి గ్రామానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తాను ఉన్నానని ఆందోళన చెందొద్దని చెప్పారు.

ఘనంగా రైతాంగ పోరాట వారోత్సవాలు



పాల్గొన్న సీపీఐ నాయకులు

అమరచింత: మండలంలోని చంద్రగడ్ గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పార్టీ నాయకులు గ్రామస్తులతో కలిసి అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అబ్రహం, జిల్లా నాయకుడు శ్రీహరి మాట్లాడుతూ.. భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగా సాయుధ పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆనాటి పోరాట ఫలితంగానే సెప్టెంబర్17న భారత దేశంలో విలీనమైందన్నారు. అప్పటినుంచి నేటివరకు అధికారికంగా నిర్వహించలేక పోతున్నాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మీశెట్టి, ఎర్రన్న, రాములు, శ్రీనివాస్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

నీటివృథా అరికట్టరూ..



బోరుమోటార్ వద్ద వృథాగా పోతున్న నీరు

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి గ్రామంలో పంచాయతీ బోరు మోటరు నీరు వృథా అవుతుందని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఒక ప్రక్క నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు సక్రమంగా సరఫరా చేయాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రతీ నిత్యం నీరువృథా అవుతూ బోరు సమీపంలో పాకర పట్టింది. పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

‘అమ్మపేరిట’ మొక్క నాటిన విద్యార్థులు



తల్లితో కలిసి మొక్క నాటుతున్న విద్యార్థిని

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం విద్యార్థినులు అమ్మపేరిట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు, పాఠశాల ఎకో క్లబ్ కో ఆర్డినేటర్ మల్లేష్‌కుమార్ మాట్లాడారు. పాఠశాలలు హరిత శోభితం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏక్ పేడ్ మాకే నామ్ 2.0 పేరుతో ప్రతి పాఠశాలల్లో విద్యార్థి తన అమ్మ పేరుతో మొక్క నాటి సంరక్షించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పాఠశాలల్లో ఇప్పటివరకు 50 మొక్కలను అమ్మపేరుతో నాటి వాటి వివరాలను మిషన్ లైఫ్‌పోర్టల్‌లో నమోదు చేస్తున్నామన్నారు. అనంతరం పాల్గొంటున్న విద్యార్థులకు ధృవపత్రాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

బిజినేపల్లి: గద్వాలలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండలానికి చెందిన 6 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ రాగా, నలుగురు సిల్వర్ మెడల్స్ సాధించారు. మరో 9 మంది విద్యార్థులకు కాంస్య పతకాలు అందుకున్నారు. బిజినేపల్లి, వట్టెం, మహదేవునిపేట, మంగనూర్ గ్రామాల నుంచి 23 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొన్నారు. అందులో గోల్డ్ మెడల్స్ సాధించిన 6 మంది విద్యార్థులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయబరేలి జిల్లాలో నవంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి తైక్వాండోక్రీడల్లో పాల్గొంటారని తైక్వాండో సెక్రెటరీ మాస్టర్ శ్రీహరి, జిల్లా కార్యదర్శి శేఖర్, కోచ్‌లు ధనలక్ష్మిలు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు ప్రయోజనం



చెక్కును అందజేస్తున్న జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ

వీపనగండ్ల: సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేద కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నాయని జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అన్నారు. ఆదివారం కల్వరాల్ల గ్రామంలో పోచమోని సురేష్ కుటుంబానికి వచ్చిన రూ.18 వేల చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఆర్థికసాయాన్ని అందిస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ మీనిగరాముడు, చింత దయాకర్, భాస్కర్, తిరుపతయ్య, స్వాములు పాల్గొన్నారు.

సెగ్రిగేషన్ షెడ్ ఉన్నా.. చెత్త బయటికే



చెత్తను సెగ్రిగేషన్ షెడ్ బయట పారబోస్తున్న దృశ్యం

అమరచింత: పట్టణంలో ఇంటింటి నుంచి తరలిస్తున్న తడి, పొడిచెత్తను సెగ్రిగేషన్‌షెడ్‌లో వేయకుండా షెడ్ బయట చెత్త చెదారం వేస్తుండటంతో పరిసరాలు దుర్గంధంగా తయారైంది. సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఇళ్లనుంచి సేకరించిన చెత్తను తడి, పొడిగా వాటిని వేరు చేయడానికి రూ.25లక్షలతో నిర్మించిన షెగ్రిగేషన్ షెడ్‌ను నిరుపయోగంగా వదిలేశారు. ఇప్పటివరకు తడి, పొడి చెత్తను వేరు చేయకుండా సేకరించిన బయటే వేస్తూ తగలబెడుతున్నారు. అధికారులు స్పందించి షెగ్రిగేషన్ షెడ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

‘మాంసాహారం వద్దు.. శాకాహారమే ముద్దు’



శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

ఆత్మకూర్: మాంసాహారం భుజించడం వల్ల ఎన్నోరకాల అనారోగ్య సమస్యలు వస్తాయని శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని బ్రహ్మర్షి పితామహ పత్రీజీ కుమార్తె పరిణీత పత్రీ, పిరమిడ్ ధ్యాన మాస్టర్ బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మసాయి పిరమిడ్ ధ్యాన మందిర ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో పురవీధులగుండా భారీ శాకాహార ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు సుమిత్ర వెంకటేష్ నిర్మించిన త్యాగరాజు పిరమిడ్, అనురాధ, విజయప్రకాష్ నిర్మించిన లక్ష్మీనర్సింహా పిరమిడ్, రాధ, విష్ణు నిర్మించిన వాయుపుత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, గోపాల్, బాలకృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, నర్సింహా, స్వప్న, యాదవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నీరజ, మనీషా, పల్లవి, శివరాములు, శ్రీనివాస్‌గౌడ్, రఘుపతిరెడ్డి, పల్లవి, మంజుల తదితరులు ఉన్నారు.

సంపదవనం గొర్రెల పాలు



సంపదవనంలో చొరబడిన గొర్రెలు

అమరచింత: మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పుష్కరఘాట్ రహదారిలో ఏర్పాటు చేసిన సంపదవనాల్లో మొక్కలు గొర్రెలకు ఆహారంగా తయారైంది. ప్రభుత్వం పర్యావరణం కాపాడాలనే ఉద్దేశంతో నిధులను వెచ్చించి ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలను నాటడం, వాటి రక్షణ కోసం కంచె, గేట్‌లను ఏర్పాటు చేసిన సంరక్షణలో మాత్రం అలసత్వం చూపుతున్నారు. గేట్‌లు ఎప్పటికి తెరుచుకుని ఉండటంతో ఎదుగుతున్న మొక్కల ఆకులను తినడమే కాకుండా వాటిని సైతం నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



మదనాపురం ఉమ్మడి మండల నూతన యూనియన్ సభ్యులతో ఫొటోగ్రాఫర్స్

కొత్తకోట రూరల్: మదనాపురం ఉమ్మడి మండలం ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ అల్లావుద్దీన్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌చారి, కోశాధికారిగా భూపాల్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ప్రచార కార్యదర్శులుగా అశోక్, రవిని ఎన్నుకున్నారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సన్మానించారు. హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరుగను న్న ఫొటోఎక్స్‌పో పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఇంచార్జ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నందు, శేఖర్, సత్యం, సలాం, యాదయ్యసాగర్, బాలరాజు, శ్రీనివాసులు, నాగన్న, ముజీబ్, సాయిబాబా, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



నీటి కుంటలో విద్యుత్ స్తంభాలు ఇలా..

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా సమీపంలోని నీటికుంటలో విద్యుత్ స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వ్యవసాయ కనెక్షన్ల కోసం కరెంట్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్, బోరుమోటర్ల స్తంభాలు నీటిలోనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.